క్లుప్తంగా

ఉపాధి కూలీలకు వేతనం పెంచాలి


ఆందోళన చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఉపాధి కూలీలకు రోజువారి కూలీ రూ.600కు పెంచి అమలు చేయాలని, ప్రతి కూలీకి 200 రోజుల పనిదినాలు కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శివలింగం, బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు వేతనాలు పెంచాలని, పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, పని కోరిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలనే డిమాండ్లతో సంఘం ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో పని ప్రదేశాల్లో కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ గౌతమ్‌కు అందజేశారు. కార్యక్రమంలో కంకణాల అర్జున్‌రావు, బి.లాజరు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, వీర్ల వెంకటఅప్పారావు, రెంటాల యాదగిరి, కేలోతు పాపారావు, కూరాకుల నర్సయ్య, గోగుల సోములు, మారుతి మల్లయ్య, అవిరేని వెంకన్న, చిర్రా భిక్షం, గంటా శ్రీను, బి.జాషువా పాల్గొన్నారు.

తిప్పారెడ్డిగూడెంలో గంగమ్మ జాతర


జాతర సందర్భంగా పూజలు చేస్తున్న భక్తులు

తిరుమలాయపాలెం: మండలంలోని తిప్పారెడ్డిగూడెంలో గంగమ్మతల్లి జాతరను ప్రజలు సోమవారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల ఎంపీపీ మంగీలాల్ పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని గంగమ్మ తల్లిని వేడుకున్నారు. గ్రామస్తుల కోరిక మేరకు తనసొంత ఖర్చులతో బోరు వేయించినట్లు ఆయన తెలిపారు. భక్తులు బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పోట్ల సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: 2007 బ్యాచ్‌కి చెందిన దివంగత కానిస్టేబుల్ అనిల్‌కుమార్ జయంతి సందర్భంగా అతడి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు సోమవారం ఖమ్మం నగరంలోని అన్నం ఫౌండేషన్‌లో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ అనిల్‌కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

కార్పొరేటర్ కార్యాలయంలో జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కస్బాబజార్‌లోని 38వ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు షేక్ జిలానీ జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ షేక్ ఖమర్, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ షౌకత్ అలీ, అల్ మేవా జిల్లా అధ్యక్షుడు షేక్ యాకూబ్‌పాషా, నాయకులు రియాసత్, సాయి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	విరూపాక్ష
సాయిరాం	రామబాణం
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	కేరళ స్టోరీ
సుందర్	కథ వెనుక కథ

- ఖమ్మంవ్యవసాయం

మెరుగైన సేవలకు పురస్కారం

- ఉత్తమ పీహెచ్‌సీగా కూసుమంచి
- కేంద్ర ప్రభుత్వం నుంచి ఇటీవల ఎన్‌క్వాస్ గుర్తింపు
- మూడేళ్ల పాటు రూ.3 లక్షల చొప్పున అందనున్న నిధులు


ఆస్పత్రిలో పరిశీలిస్తున్న కేంద్ర బృందం (ఫైల్)

కూసుమంచి: కూసుమంచిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు ఉత్తమ వైద్యసేవలు అందించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్) పురస్కారాన్ని ప్రకటించింది. ఈ పురస్కారం ద్వారా నిధులు అందనుండటంతో ఆస్పత్రి అభివృద్ధికి దోహదపడుతుందని చెబుతున్నారు.

క్రమక్రమంగా ఉత్తమంగా..

కూసుమంచిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఒకప్పటికీ, ఇప్పటికీ ఎంతో మార్పు సంతరించుకుంది. గతంలో ఈ ఆస్పత్రిలో వైద్యానికి వచ్చేందుకు ప్రజలు ఆసక్తి కనబర్చకపోయేవారు. ఏ చిన్న సమస్య వచ్చినా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లేవారు. కానీ, పీహెచ్‌సీలో ఇప్పుడు కల్పించిన సౌకర్యాలు, అందిస్తున్న సేవలతో ప్రజలు ఏదైనా ఇబ్బంది వస్తే ఇక్కడికి వచ్చేందుకే ప్రాధాన్యమిస్తున్నారు. నిత్యం వంద వరకు ఓపీ నమోదవుతుండటం గమనార్హం.

వసతుల కల్పన.. చక్కటి వాతావరణం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలను సమకూర్చారు. పచ్చటి చెట్లతో, శుభ్రమైన పరిసరాలతో ఆస్పత్రికి వచ్చేవారికి ఆహ్లాదంగా ఉంటుంది. ల్యాబ్, ఫార్మసీ, వేచి ఉండే గదులు, ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఏసీ సౌకర్యం కూడా ఈ ఆస్పత్రికి ఉంది. దీంతో ఓపీ కోసం వచ్చే వారే కాక సాధారణ కాన్పుల సంఖ్య సైతం ఇటీవల గణనీయంగా పెరిగింది. ఈ ఆస్పత్రిలో నేషనల్ హెల్త్ ప్రోగామ్స్‌లో సత్ఫలితాలు రావటంతో గతంలో కాయకల్ప అవార్డుకు కూడా ఎంపికై ఆదర్శంగా నిలిచింది.

ఎన్‌క్వాస్‌కు ఎంపిక

కూసుమంచి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఇటీవల కేంద్ర బృందం సందర్శించి ఆరు అంశాల్లో పరిశీలించింది. రికార్డుల నిర్వహణ, ల్యాబ్ ద్వారా అందుతున్న సేవలు, పరిశుభ్రత, వైద్యసేవలు, ఎమర్జెన్సీ డ్రగ్స్, లేబర్‌రూం, నేషనల్ హెల్త్ మిషన్ అమలుపై పరిశీలించగా 81.33 శాతం మార్కులు కేటాయించారు. దీంతో ఎన్‌క్వాస్ పురస్కారానికి ఎంపిక చేయగా.. మూడేళ్ల పాటు రూ.3 లక్షల చొప్పున నిధులు కేంద్రం నుంచి అందనున్నాయి.


కూసుమంచిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అవార్డు బాధ్యతను పెంచింది



మా ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వ ఎన్‌క్వాస్ పురస్కారం రావటం ఆనందంగా ఉంది. మా సిబ్బంది కృషి, ఉన్నతాధికారుల సహకారంతో ఈ అవార్డును సాధించగలిగాం. ఈ పురస్కారంతో మరింత బాధ్యత పెరిగిందని భావిస్తూ ప్రజలకు ఇంకా మరింత మెరుగైన సేవలు అందించి ఆస్పత్రిని ముందంజలో నిలుపుతాం. ఎప్పటిలాగే వైద్య సిబ్బంది ప్రజలకు సేవ అందించడంలో శక్తివంచన లేకుండా కష్టపడాలి.

-కె.కిషోర్, వైద్యాధికారి

ప్రజలకు మెరుగైన సేవలు



గతంలో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించేవారు. కానీ, మా ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుండటంతో ప్రభుత్వ వైద్యంపై వారికి నమ్మకం కలిగేలా వ్యవహరించాం. దీంతో రోజుకు 100కు పైగా ఓపీ నమోదవుతోంది. అలాగే, ఆస్పత్రిలో సాధారణ కాన్పులు పెరిగేలా కృషి చేస్తున్నాం. అందరి సహకారంతో పీహెచ్‌సీ అవార్డుకు ఎంపికైంది.

-మమత, స్టాఫ్‌నర్స్

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి..

నేలకొండపల్లి: ఖమ్మం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి ఎస్‌ఐ జి.స్రవంతి కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పలు ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పోలీసు శాఖ ఈ నెల 21న ఖమ్మంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహిస్తోందని, వందకు పైగా కంపెనీలు సుమారు నాలుగు వేల ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని వెల్లడించారు. రూ.10 వేల నుంచి రూ.80 వేల వేతనం ఇవ్వనున్నారని ఎస్‌ఐ వివరించారు.

అక్రమంగా కేసులు బనాయించారని ఫిర్యాదు

ఖమ్మంమామిళ్లగూడెం: బీజేపీ నాయకులపై ఈ నెల 11న టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో అక్రమ కేసులు బనాయించారని, వెంటనే ఎత్తి వేయాలని కోరుతూ మైనార్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అజయ్‌తండాలో రేషన్ షాపు ప్రారంభం

నేలకొండపల్లి: మండలంలోని అజయ్‌తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ చౌకధరల దుకాణాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మరికంటి ఉష, సర్పంచ్ బి.పార్వతి, డీలర్ బి.తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో అగ్రభాగాన ఖమ్మం

- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- పలు డివిజన్లలో అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన


ఖమ్మంఅర్బన్: అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్/ ఖమ్మంఅర్బన్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో నగరం అగ్రభాగాన నిలుస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. నగరంలోని 8, 12, 13, 42, 43 డివిజన్లలో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ నిధులే కాకుండా సీఎం హామీ, మంత్రి కేటీఆర్ మంజూరు చేసిన రూ.కోట్లాది అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, ఈఈలు, డీఈలు రంజిత్, రంగారావు, స్వరూపారాణి, నవ్యజ్యోతి, విద్యుత్ ఏడీ రమేశ్, కార్పొరేటర్లు జాన్‌బీ, చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావు, కొత్తపల్లి నీరజ, క్లైమెంట్, కూరాకుల వలరాజ్, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, దేవభక్తుని కిశోర్‌బాబు, గొల్లపూడి రాంప్రసాద్, వాంకుడోత్ సురేశ్, గుగులోత్ మోహన్, తాజుద్దీన్, బత్రి వినయ్, కన్నం ప్రసన్న, కృష్ణ పాల్గొన్నారు. కాగా, 8వ డివిజన్ ఎల్‌బీ నగర్‌కు చెందిన గోపిరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా, ఆయనను మంత్రి పువ్వాడ పరామర్శించారు.

'త్రివేణి' విద్యార్థులకు అభినందన


ఖమ్మంమయూరి సెంటర్: 'త్రివేణి' విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి

పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన త్రివేణి విద్యార్థులను రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా త్రివేణి విద్యాసంస్థల అధిపతి గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ తమ విద్యార్థులు 56 మంది 10జీపీఏ, 196 మంది 9.7కి పైగా జీపీఏ, 479 మంది 9కి పైగా జీపీఏ సాధించారని తెలిపారు. కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి సంస్థల అధిపతి వెంకటేశ్వరరావు, సీఆర్వో మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అకడమిక్ ఇన్‌చార్జ్ ముస్తఫా, ఐఐటీ అకడమిక్ ఇన్‌చార్జ్ అశోక్‌తో పాటు చార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతకు భారత సేవారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న వెంకటరమణ

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం నగరానికి చెందిన, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ధనియాకుల వెంకటనారాయణయాదవ్‌కు భారత సేవారత్న అవార్డు దక్కింది. కరోనా లాక్‌డౌన్ సమయంలో చేసిన సేవలు, ఐదేళ్లుగా డీవీఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించిన సేవలకు గాను ప్రైడ్ ఇండియా అవార్డ్స్-2023 కమిటీ ఈ అవార్డుకు ఆయన్ను ఎంపిక చేసింది. నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ సోమవారం అవార్డును వెంకటరమణయాదవ్‌కు ప్రదానం చేశారు.

కరాటే శిక్షణ ప్రారంభం


శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్

ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని 30వ డివిజన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యాన ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య పార్కులో ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఎం.రాజేశ్ మాట్లాడుతూఅందరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. కరాటే మాస్టర్ ఎం.బాబు శిక్షణ ఇవ్వనుండగా 45 రోజుల పాటు ప్రతీ రోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు.

'కంటివెలుగు' షురూ

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లెపల్లి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ మంగీలాల్ సోమవారం ప్రారంభించారు. తహసీల్దార్ పుల్లయ్య, ఎంపీడీఓ జయరాం, సర్పంచ్ శైలజ, భాషబోయిన వీరన్న, డాక్టర్ రామారావు, నాగమణి పాల్గొన్నారు.

మనువాద కార్పొరేట్ల గుప్పిట్లో క్రీడారంగం


నిరసన తెలుపుతున్న పలు సంఘాల బాధ్యులు


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దేశ కీర్తిని ప్రపంచ నలుమూలలా చాటుతున్న క్రీడారంగం.. మనువాద కార్పొరేట్ పాలకుల గుప్పిట్లో ఉందని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి, పీవైఎల్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు ఎస్‌వీ రాకేశ్, వి.వెంకటేశ్ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పీఓడబ్ల్యూ, పీవైఎల్, పీడీఎస్‌యూ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒలింపిక్స్, కామన్వెల్త్, ఏషియన్ గేమ్స్‌లలో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించి దేశకీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసిన మహిళా మల్లయోధులు (రెజ్లర్లు)పై అధికార బీజేపీ ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడితే ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. రెజ్లర్లకు న్యాయం చేసే వరకు పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు టి.ఝాన్సీ, ఆవుల మంగతాయి, భరత్, ఇస్లావత్ స్వాతి, తిప్పారపు లక్ష్మణ్, మామిడాల వెంకటేశ్వర్లు, డివిజన్ నాయకులు రవీందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ చైర్మన్ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు షేక్ సుభాహన్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని రాపర్తినగర్ వద్ద సోమవారం బ్రిజ్‌భూషన్ దిష్టిబొమ్మ దహనం చేశాక సుభాహన్ మాట్లాడారు. దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసిన మహిళా రెజ్లర్లు తమకు అన్యాయం జరిగిందని చెబుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం గర్హనీయమన్నారు. నాయకులు కొండల్, జానారెడ్డి, మోహన్‌రావు, బోడ నాగేశ్వరరావు, మల్లేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఏకపక్షంగా కూలీ రేట్లు పెంచడం దారుణం


ఖమ్మంమామిళ్లగూడెం: నినాదాలు చేస్తున్న పలు సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంమామిళ్లగూడెం: సుతారి కార్మికులు ఏకపక్షంగా వారి కూలీ రేట్లు పెంచుకోవడం దారుణమని క్రెడాయ్, బిల్డర్స్ అసోసియేషన్ బాధ్యులు కొప్పు నరేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది కార్మికులు కలిసి రూ.800 నుంచి రూ.950 వరకు పెంచినట్లు ప్రకటించారని, రేట్లు పెరిగితే ఇప్పటికే నిర్మాణంలో ఉన్న భవనాలు, అన్ని రంగాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా భారం పడి కుదేలవుతాయని పేర్కొన్నారు. కూలీ రేట్ల పెరుగుదలను నిరసిస్తూ నిర్మాణదారులు పనులను స్వచ్ఛందంగా నిలిపివేయాలని తీర్మానించామని, అందరూ సహకరించాలని కోరారు.

నేటి నుంచి కూలీ రేట్లు పెంపు

పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా సుతారి కూలీ రేట్లను మంగళవారం నుంచి పెంచుతున్నట్లు ఖమ్మం పట్టణ తాపీ మేస్త్రీల యూనియన్, మహాజన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్‌లు తెలిపాయి. సోమవారం జరిగిన సమావేశంలో ఆయా సంఘాల నాయకులు తాడిశెట్టి వీరేశం, పేశెట్టి వెంకన్న, మలిశెట్టి రామారావు, లాల్‌మియా మైబూ, నకిరికంటి సంజీవరావు మాట్లాడారు. సుతారికి రూ.1,000, పురుష కూలీకి రూ.700, మహిళా కూలీకి రూ.650, పనిచేసే సమయం 8 గంటలుగా నిర్ణయించామని చెప్పారు. సమావేశంలో బండి రవి, ముత్తయ్య, తొట్టిపల్లి శ్రీను, కుమారస్వామి, మరియన్న, నాగుల్‌మీరా, పాషా, హుస్సేన్, నాగరాజు, రమేశ్, బాజీ, అశోక్, వెంకన్న, వెంకటేశ్వర్లు, ఫిలిప్స్, శ్రీను, ఫిరంగి వెంకన్న, వీరయ్య పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతి


ఖమ్మంఅర్బన్: కమిషన్ సభ్యుడికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్ సోమవారం జిల్లాకు రాగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా కమిటీ బాధ్యులు కలిశారు. ఈ సందర్భంగా గిరిజనుల రిజర్వేషన్లు, హాస్టళ్లలో మెస్ చార్జీల పెంపు, పోడు భూములకు హక్కు పత్రాలు, జిల్లాలో గిరిజన స్పోర్ట్స్ అథారిటీ సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేసినట్లు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు బస్కినాయక్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు చంద్రంనాయక్‌తో పాటు బానోతు తారాదేవి, తేజావత్ అనిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పలువురి వినతులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం వచ్చిన జాతీయ గిరిజన కమిషన్ సభ్యుడు అనంత్‌నాయక్‌ను ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌లో గిరిజన సంఘాల నాయకులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, టీటీఎఫ్‌టీఎస్ నాయకులు బానోత్ కిషన్ నాయక్, మాలోత్ రామారావు, సేవాలాల్ గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు భూక్యా బాబూలాల్, బహుజన పూజారుల శివసత్తుల సంఘం బాధ్యులు కోటేశ్వరి, సుశీలబాయి తదితరులు వినతిపత్రాలు అందజేసిన వారిలో ఉన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలను ఎంపిక చేసుకోండి..

ఖమ్మంసహకారనగర్: 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరాలనుకునే వారు తమ కళాశాలను ఎంపిక చేసుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో విశాలమైన ప్రాంగణం, తరగతి గదులు, అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అన్ని రకాల కోర్సులు కూడా ఉన్నాయని వెల్లడించారు.

సర్పంచ్‌లకు సేవారత్న అవార్డులు


రఘునాథపాలెం సర్పంచ్ శారద దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు సేవారత్న అవార్డులు దక్కాయి. ఖమ్మంలో ప్రైడ్ ఇండియా ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన సమావేశంలో రఘునాథపాలెం సర్పంచ్ గుడిపుడి శారదరామారావుతో పాటు కోటపాడు, పువ్వాడనగర్, జీకే బంజర, చింతగుర్తి సర్పంచ్‌లు బాతుల రమణసుధాకర్, కంపాటి లలితరవి, పిన్ని సరిత కోటేశ్వరరావు, మెంటం రామారావు అవార్డులు అందుకున్నారు. మేయర్ పి.నీరజ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మాధంశెట్టి హరిప్రసాద్, సుడా చైర్మన్ విజయ్, రాజశేఖర్ తదితరులు వారికి అవార్డులు అందజేసి సత్కరించారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం..

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు సీఎం కప్ పేరిట క్రీడలను నిర్వహిస్తున్నారని తెలిపారు. సోమవారం మండల కేంద్రాల్లో సీఎం కప్ క్రీడలు ప్రారంభమైన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో వారు ఈ వ్యాఖ్యలు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

-సాక్షి నెట్‌వర్క్


రఘునాథపాలెం: క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ అప్పారావు


నేలకొండపల్లి: క్రీడలను ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ధనలక్ష్మి


ఖమ్మంరూరల్: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ బెల్లం ఉమ


తిరుమలాయపాలెం: వాలీబాల్ క్రీడాకారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు


కూసుమంచి: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ, ఎస్‌ఐ